క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



గురజాల రూరల్(పల్లెగుంత): సమస్యలతో సహవాసం చేస్తున్నాం.... మా సమస్యలు పరిష్కరించేలా చర్యలు చూపాలని విద్యార్థులు శనివారం ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రెడ్డి వద్ద విన్నవించుకున్నారు .మండల పరిధిలోని పల్లెగుంతలో ఏపీ మోడల్ పాఠశాలలో రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. భోజనం సరిగ్గా ఉండటం లేదు. రుచికరమైన భోజనం అందడం లేదని, పాఠశాలలో మంచినీటి బోరు తరచూ మరమ్మతులకు గురవుతోందని, అటువంటి సమయంలో నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్ విద్యార్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల



గురజాల: స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. నగరపంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలోని శ్రీ పల్నాడు యాదాద్రి శ్రీదేవి భూదేవి సమేత నరసింహ స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేలమూరి సైదారెడ్డి, కౌన్సిలర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టుదల ఎంతో ముఖ్యం



రెంటచింతల: విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కృషితో పాటు పట్టుదల ఎంతో ముఖ్యమని వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యేచూరి వెంకటసైదయ్య అన్నారు. శనివారం క్లాసుల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు ఆయన తల్లిదండ్రులు యేచూరి సత్యనారాయణ, వెంకమ్మల జ్ఞాపకార్థం దుప్పట్లు, ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యాభివృద్ధికి వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.చంద్రం, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బి.రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, నాళం పెదబాబు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు నమోదు చేసుకోండి


దాచేపల్లి: ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎంవీ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల9వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, అర్హత ఉన్న పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

తిరునాళ్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



గురజాల: స్థానిక శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్న తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ, తహసీల్దార్ కె.నగేష్, డీఎస్పీ జగదీష్, నాయకులు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, బుల్లయ్య, పులుకూరి కాంతరావు, కె.అంకారావు పాల్గొన్నారు.

స్మార్ట్‌గా కొర్రీ



ఉపాధి కోల్పోనున్న మీటర్ రీడర్లు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను శర వేగంగా అమల్లోకి తెచ్చారు. దీంతో విద్యుత్ రీడర్లు ఉపాధి కోల్పోనున్నారు. అంతే కాకుండా ఈ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు కూడా పెరగనున్నాయి.

- విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే పనిలో సిబ్బంది
- తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో
- దశల వారీగా ప్రీ పెయిడ్ విధానం అమలు

గురజాల : స్మార్ట్ మీటర్లతో పలువురి ఉపాధికి గండి పడనుంది. విద్యుత్ శాఖలో ప్రతి కార్యాలయం, ఇల్లు ఇలా అన్ని సర్వీసులకు రీడింగ్ తీస్తూ ఉపాధి పొందుతున్న పలువురు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వాటిని త్వరలో ప్రీ పెయిడ్ ఆప్షన్‌లోకి మార్చి కార్యాలయం నుంచి ఓ కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా ఆపరేట్ చేయించేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ విధానం అమల్లోకి వస్తే స్పాట్ బిల్లింగ్‌కు అవకాశం ఉండదు. అపుడు ఇక మీటరు రీడర్‌లతో పని ఉండదు. దీంతో చిరు కార్మికుల కుటుంబాలు రోడ్డు పాలయ్యే అవకాశాలున్నాయి. కమిషన్ పద్ధతిలో ఏళ్ల తరబడి సంస్థను నమ్ముకున్న వీరి కడుపు కొట్టేందుకు రంగం సిద్ధమైంది.



స్మార్ట్ మీటర్ బిగిస్తున్న సిబ్బంది

రీచార్జి చేసుకోవాల్సిందే

విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు అత్యాధునిక సాంకేతికతతో కూడుకున్నవి. వీటిలో మోడెంతో పాటు సిమ్ చిప్ ఏర్పాటు చేయబడి ఉంటుంది. వీటిని మొబైల్ రీచార్జి చేసుకున్నట్లుగా ముందుగా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారులు నెల నెలా విద్యుత్ వాడకానికి ముందే సెల్ ఫోన్, కేబుల్ డీటీహెచ్ మాదిరిగా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. రీచార్జి చేసుకున్న సమయం ముగిసిన వెంటనే విద్యుత్ నిలిచిపోతుంది.

విద్యుత్ స్మార్ట్ మీటరు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు ప్రారంభం

నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే పనిలో ఉద్యోగులు నిమగ్నమయ్యారు. గృహ విద్యుత్ మీటర్లను కూడా త్వరలో మార్చనున్నట్లు సమాచారం. అన్ని సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసిన తరువాత దశల వారీగా ప్రీ పెయిడ్ విధానంలోకి మారుస్తారు. అంతేకాకుండా ఈ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు కూడా పెరుగుతాయని పలువురు నిపుణులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అన్ని సర్వీసుల విద్యుత్ మీటర్లు 1,13,923 ఉన్నాయి. వాటికి సంబంధించి ప్రతి నెలా 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 34 మంది విద్యుత్ మీటర్లకు రీడింగ్ తీస్తూ వాటి నుంచి వచ్చే కమిషన్‌తో జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వాడుకలోకి వస్తే రీడింగ్ తీసి జీవనం సాగించే వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారనుందని పలువురు అంటున్నారు. అదే జరిగితే విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసేవారు ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిందే.

మండలాల వారీగా వివరాలు ఇలా...

మండలం	మీటరు	రీడింగ్ తీసే ఉద్యోగులు
గురజాల	27,284	7
దాచేపల్లి	25,389	10
మాచవరం	17,950	6
పిడుగురాళ్ల పట్టణం	28,750	6
పిడుగురాళ్ల రూరల్	14,550	5
మొత్తం	1,13,923	34

విద్యారంగం పటిష్టతకు ప్రభుత్వం కృషి

ఆర్‌డీఓ మురళీకృష్ణ

గురజాల: విద్యారంగం పటిష్టతకు ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ శనివారం నిర్వహించారు. గురజాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమిషనర్ శివన్నారాయణ, జీవనీ కాలనీలోని జిల్లా పరిషత్ బాలికలపాఠశాలలో ఎంపీడీఓ, కేజీబీవీలో డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మంచి భవిష్యత్తుకు విద్య ఎంతో కీలకమన్నారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవ్వద్దని పోలీసులు అవగాహన కల్పించారు. గురజాలలోని బాలికల పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు నరసింహారావు విద్యార్థులు తీసుకోవల్సిన జాగ్రత్తలను నాటక ప్రదర్శనల ద్వారా వివరించారు.

అందరికి విద్య బాధ్యత ప్రభుత్వానిదే.. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి: పేద విద్యార్థుల చదువుల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్- టీచర్ల సమావేశాలు శనివారం నిర్వహించారు. స్థానిక జెడ్పీ, ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సమస్యలతో పేద విద్యార్థుల చదువులు ఆగిపోకుండా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గామాలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి పాల్గొని ప్రసంగించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, ఎంపీపీ జాను, వైస్ ఎంపీపీ అబ్దుల్‌సత్తార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు సాంబయ్య, విజయ్‌కుమార్, ఎంఈఓ పినాకపాణి పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి పేరెంట్స్ శ్రద్ధ చూపాలి

వెల్దుర్తి: విద్యార్థుల ఉన్నతంగా చదవాలంటే ఉపాధ్యాయులు చెప్పే విద్యతో పాటు, ఇంటి వద్ద తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని హెచ్‌ఎం బి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని దళితవాడ ఎంపీపీ పాఠశాలలో పేరెంట్స్- టీచర్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్ ఆదిరాల శామ్యూల్ మాట్లాడుతూ పాఠశాల మరమ్మతులుంటే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు.

క్రమశిక్షణ.. నైతిక విలువలకు ప్రాధాన్యం ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు

రెంటచింతల: బోధనలో క్రమశిక్షణ.. నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు కోరారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 37 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు 80 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావడం శుభపరిణామం అన్నారు. స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉందాం.. బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకుందాం అనే పోస్టర్లను ప్రిన్సిపాల్ ఎస్. మోహన్, స్కూల్ కమిటీ చైర్మన్‌లతో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. తుమృకోట జెడ్పీ హైస్కూల్‌లోని సమావేశంలో సర్పంచి నలబాలునాయక్ మాట్లాడారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొప్పునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ముగ్గుల పోటీలు

అన్ని పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు

కారెంపూడి: మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు శనివారం నిర్వహించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ మండల ప్రత్యేక అధికారి సిద్ధ లింగమూర్తి పాల్గొన్నారు. తల్లిదండ్రులు పాఠశాల పనితీరు, సౌకర్యాలు, చదువుల పట్ల శ్రద్ధ పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మన బడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా బాలికా విద్య పట్ల శ్రద్ధ పెట్టాలని కోరారు. అలాగే ప్రతి పాఠశాలలోనూ మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లు జరిగాయి. ముగ్గుల పోటీలు నిర్వహించారు.పేరెంట్స్, టీచర్స్‌కు తాడు ఆటలు ఇతరత్రా పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మాచవరంలో ఆత్మీయ సమావేశం

మాచవరం: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. పాఠశాలల అభివృద్ధిపై చర్చించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, దాతలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పిడుగురాళ్ల: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్య పరంగా మంచి విజ్ఞానాన్ని అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సమాజ సేవకుడు అందే సాహెబ్ అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు హాజరై విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎలా ఉండాలనే అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొన్నారు.

మన బిడ్డల భవిష్యత్తు బాధ్యత మనదే ప్రత్యేకాధికారి గబ్రూనాయక్

మాచర్ల రూరల్: మన బడి మన పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందని మండల ప్రత్యేకాధికారి గబ్రూనాయక్ అన్నారు. శనివారం మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్ఎస్‌లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తమ పిల్లలు గురించి ప్రతి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో తరచూ చర్చిస్తూ చిన్నారుల భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గబ్రూనాయక్ బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఎం రామిరెడ్డి, విజయకుమారిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ వేముల నాగయ్య, ఏపీడీ కొరటా మల్లిఖార్జునరావు, కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు తదితరులున్నారు. మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కొప్పునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం అప్పారావు నేతృత్వంలో నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్ ఎస్ వీరాంజనేయులు, పూర్వ విద్యార్థి మల్లిఖార్జునరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి – మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి

విజయపురిసౌత్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలం ఏడో మైలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గత 10వ తరగతి ఫలితాల్లో 98% ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ఈ ఏడాది కూడా 98% ఉత్తీర్ణత సాధిస్తే ఉపాధ్యాయులకు రూ.1,50,000 నగదు బహుమతిగా అందజేస్తానన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం యు.లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ మేరిమంజుల, పీటీజీ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ శామ్యూల్ జాన్, క్యాంప్-1 ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం దస్రూనాయక్, క్యాంప్-2 పాఠశాలలో హెచ్‌ఎం ఏ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీటింగ్స్ జరిగాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గా భవాని, ఎస్‌ఎంసీ చైర్మన్ కె.అనిత, టీడీపీ నాయకులు పంగులూరి పుల్లయ్య, గుండాల శ్రీనువాసరావు, వజ్రం నాయక్, సైదారావు, గంటా ధనుంజయ రావు, సాంబశివరావు, గోపీరెడ్డి, వెంకటేశ్వర్లు నాయక్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్, బాబు పాల్గొన్నారు.



తుమృకోట జెడ్పీ హైస్కూల్‌లో...



రెంటచింతలగిరిజన గురుకుల పాఠశాలలో...



మన బడి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రత్యేక అధికారి సిద్ధ లింగమూర్తి



మాట్లాడుతున్న మాచర్ల ఎమ్మెల్యే



కంభంపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో గబ్రూనాయక్



మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో అందే సాహెబ్



మాచవరంలో ఆత్మీయ సమావేశం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మాచర్ల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత, బాలుర పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యాభివృద్ధికి ,మాచర్ల మండలం తాళ్లపల్లిలో కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావుతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల టీడీపీ నాయకులు కేశవరెడ్డి, నియోజకవర్గ ఎస్టీ అధ్యక్షుడు వజ్రానాయక్, ఎంఈఓ అల్లి సురేష్, పాఠశాల చైర్మన్ రాజు, హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు హసీనా, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. రూ.15వేలు విలువ చేసే స్టూడెంట్స్ కిట్‌ను నెహ్రూనగర్ పాఠశాలలో ఎంఈఓ అల్లి సురేష్ అందజేశారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యా శాఖ అధికారులు, పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు.



నెహ్రూనగర్ పాఠశాలలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి

సుబ్రహ్మణ్యస్వామికి శాంతి కల్యాణం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగులగుడి దేవస్థానంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి శాంతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామి వార్ల కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వివేకానంద విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

పిడుగురాళ్ల: పట్టణంలోని వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థిని హర్షిత ఈ అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ శనివారం తెలిపారు. 3వ తరగతి నుంచి 9 వరకు నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్‌కు 120 మంది హాజరు కాగా 10 లోపు ర్యాంక్‌లను 39 మంది విద్యార్థులు సాధించారని అన్నారు.

వృద్ధులకు అన్నదానం

పిడుగురాళ్ల: నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాల వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని సుందరయ్య కాలనీలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గరికపాటి శంకర్‌రావు ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు కోనేటి నరసింహారావు, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు కె.కుమార్, కోటా బాబురావు, జాయింట్ సెక్రటరీ కాకుమాను శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం

కారెంపూడి: స్థానిక వీరాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఒక దాత 300 మందికి అన్నదానం చేశారు. వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో గత నాలుగు నెలలుగా ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. ఇప్పటి వరకు 7 వేల మందికి అన్నదానం చేయగలిగామని ఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగిస్తామని నిర్వాహకులు చిన్ని లక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి, కొల్లిపర వెంకట లక్ష్మీకుమారి, చిన్ని అనంతలక్ష్మి, ఆతుకూరి లక్ష్మి, పల్లా పద్మ పేర్కొన్నారు.

వాటర్ ట్యాంక్‌ల శుభ్రత

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు వాటర్ ట్యాంక్‌లను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు శనివారం శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. పిడుగురాళ్ల పట్టణంలోని పలు వార్డులకు వాటర్ ట్యాంక్‌ల ద్వారా కొళాయిలతో తాగునీరు అందజేస్తున్నారు. అయితే వాటర్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటంతో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ ట్యాంకులను శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగానే పలు వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

డ్రైవర్లకు సత్కారం



మాచర్ల : ఉత్తమ డ్రైవర్లుగా ఆర్టీసీ డిపోకు ఆదాయం తెస్తున్న ఎనిమిది డ్రైవర్లను ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చి మరింత ఆదాయాన్ని చేకూర్చాలన్నారు. ఎనిమిది మంది డ్రైవర్లు మొహమ్మద్ వలి, ఎస్.ఎస్.రెడ్డి, ఎం.ఎస్.రెడ్డి, జె.ఎం.నాయక్, కోటేశ్వరరావు, చెన్నకేశవరావు, షేక్ లాలయ్య, కె.ఆర్.రామకృష్ణలను క్యాష్ అవార్డు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరం ప్రారంభించిన ఎమ్మెల్యే

మాచర్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రార్థనా మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని నిర్వాహకులను అభినందించారు. క్రిస్మస్ మాసంలో నూతన ప్రార్థనా మందిరం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. తన విజయానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు ఆహ్వానం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐసీడీసీ కార్యాలయ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల సహాయకురాలి పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పిడుగురాళ్ల సీడీపీవో రుక్సానా బేగం శనివారం తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలోని 27, 30 వార్డులు, శుద్దగుంతల ఏరియా, మండలంలో చెన్నాయపాలెం, పందిటివారిపాలెం, జూలకల్లు, జానపాడు, కామేపల్లి, చిన అగ్రహారం, మాచవరం మండలం మాచవరం, పిన్నెల్లిలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరించటం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా అందించాలని తెలిపారు.

శ్రీరామతీర్థ సేవాశ్రమంలో దొంగతనం

పిడుగురాళ్ల: శ్రీరామతీర్థ సేవాశ్రమంలో హుండీని పగలగొట్టి దొంగతనం చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... పిడుగురాళ్ల పట్టణంలోని మయాబజార్‌లో ఉన్న శ్రీరామ తీర్థ సేవాశ్రమంలో రాత్రి బయట గేటు తాళం పగలగొట్టి హుండీలో నగదును చోరీ చేశారు. అయితే హుండీలో ఆరు నెలలకు సంబంధించిన కానుకలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.